


# ఎక్స్‌టెన్షన్

కథ

వంశీకృష్ణ

"ట్రింగ్... ట్రింగ్... ట్రింగ్"

క్యాష్ స్క్రోలులో పెన్సిల్‌తో టోటల్స్ వేస్తున్న మృదుల ఎడమ చెయ్యి చాపి ఫోన్ అందుకుంది. అటువైపు నుండి ప్రకాష్.

"చెప్పండి సర్" అన్నది రిసీట్స్ కాలమ్ చివర పెన్సిల్‌తో టోటల్స్ వేస్తూ మృదుల.

"శాస్త్రి ప్రొబేషన్ ఎక్స్‌టెండ్ అయ్యిందట కదా!"

"అవును యిప్పుడే కొరియర్‌లో లెటర్ వచ్చింది" అన్నది మృదుల ఫోన్‌లో మాట్లాడుతూనే పేమెంట్స్ కాలమ్ టోటల్ సరిచూస్తూ.

"ఏదయినా మీరిలా చెయ్యకుండా వుండాల్సింది" అన్నాడు ప్రకాష్. ఆ మాట వింటూనే మృదుల మొహంలోకి రక్తం ఒక్కసారిగా పొంగుకొచ్చింది. అసలే ఎర్రటి మొహం మరింత ఎర్రబడింది. తన అసహనం అంతా ఫోన్‌లోనే వినబడేలా....

"వాడ్డూయూ మీన్" అన్నది.

"యస్! ఐ మీనిట్! మీరలా చెయ్యకుండా వుండాల్సింది!" మళ్ళీ సర్కాస్టిక్‌గా అన్నాడు ప్రకాష్.

"నా డ్యూటీ నేను చేశాను. అంతకు మించి నేనేం చెయ్యలేదు" అంటూ విసురుగా ఫోన్ పెట్టేసింది మృదుల తన కోపం అంతా ప్రకాష్‌కి అర్థమయ్యేలా.

ఉదయం బ్యాంక్‌కి వచ్చినప్పటినుండి అది పదిహేనో ఫోన్‌కాలో... ఇరవయ్యో ఫోన్‌కాలో! ప్రతిసారి తనను తాను డిఫెండ్ చేసుకోవాల్సి రావడంతో మృదులకి కోపం తారాస్థాయికి చేరుకుంది.

ఇంతా చేసి తనేం చేసిందని...!

"మేడమ్! బ్యాలెన్స్ చెప్తారా!" లోపల నుండి క్యాషియర్ అడుగుతున్నాడు. "మీరు బ్యాలెన్స్ చెప్తే నేను క్యాష్ క్లోజ్ చేస్తాను" ఆ మాటలకి ఆలోచనల్లో నుండి బయటకు వచ్చింది మృదుల.

అన్యమనస్కంగానే బ్యాలెన్స్ వేసి క్యాషియర్‌కి చెప్పింది. క్యాషియర్ క్యాష్ బ్యాలెన్స్ బుక్ రాశాక క్యాష్ సేఫ్‌లో పెట్టి వచ్చి కుర్చీలో రిలాక్సింగ్‌గా కూర్చుంది. యిలా కూర్చుందో లేదో... అలా ఫోన్.

"ఈ ఫోన్ యివ్వాళ నన్ను ప్రశాంతంగా వుండనిచ్చేట్టు లేదు" అనుకుంటూ ఫోన్ లిఫ్ట్ చేసింది. అటువైపు నుండి నవ్య!

"ఏంటే! శాస్త్రి ప్రొబేషన్ ఎక్స్‌టెండ్ అయిందట కదే! అందరూ నీ గురించే అనుకుంటున్నారు. నువ్వు కావాలని చేశావని. ఇందాక ప్రకాష్ నాకు ఫోన్ చేశాడు. అతడెంత వ్యంగ్యంగా మాట్లాడాడో తెలుసా...?" నాన్‌స్టాప్ ఎక్స్‌ప్రెస్‌లాగా నవ్య మాట్లాడుతోంది.

"ఏమంటాడు ప్రకాష్" మధ్యలో కల్పించుకుని అడిగింది మృదుల.

"నువ్వు కావాలనే శాస్త్రి కాన్ఫిడెన్షియల్ రిపోర్టు సరిగా రాయలేదట. అందుకే అతని ప్రొబేషన్ ఎక్స్‌టెండ్ అయిందట. సాటి కులస్తుడు అన్న ఫీలింగ్ అయినా లేకుండా నువ్వు ప్రవర్తించావట. ఈ పాపం ఉత్తగానే పోదట. ఇలా! చాలా, చాలా మాట్లాడాడు. నాకు పూర్తిగా గుర్తు కూడా లేవు" అన్నది నవ్య.

"ఎవరికి ఎలా రాయాలో నాకు తెలియదా! శాస్త్రి ఆల్కహాలిక్ తప్పిస్తే వర్క్‌హాలిక్ ఎంతమాత్రమూ కాదు. పనిచెయ్యనివాడిని, పనిచేసేవాడిని ఒకే గాటిన మనం ఎలా కట్టేస్తాం చెప్పు! అయినా శాస్త్రి గురించి నీకు తెలియదా....!"

"తెలియకేం! నాకు బాగా తెలుసు. ప్రమోషన్ రాకముందు క్లర్క్‌గా పనిచేసిన బ్రాంచిని ఎంత ఛండాలంగా తయారుచేసాడో, నాకేంటి బ్యాంకు మొత్తం అందరికీ తెలుసు".

"మరి తెలిసి, తెలిసీ అలాంటి వాడిని వెనుకేసుకురావడం దేనికి"!

"అదే మరి! రాజకీయమంటే! సరేలే! ఈ సోదంతా ఎప్పుడూ ఉండేదే కానీ, సాయంత్రం త్వరగా వచ్చేయ్...బై"! ఫోన్ పెట్టేసింది అటువైపు నవ్య.

పది నిమిషాల పాటు మౌనంగా వుండిపోయింది మృదుల. ఆమె మనసంతా గ్లూమిగా మారిపోయింది. తన తప్పేమీ లేకుండా తను టార్గెట్ కావడం. తన డ్యూటీ తను చెయ్యడం కూడా నేరం కావడం ఏమిటి యిదంతా మనుషులు యిలా ఎందుకు మారిపోతున్నారు?

"మేడం! ఏంటి యింకా అలాగే కూర్చున్నారు. లంచ్ చెయ్యరా! మా అందరికీ ఆకలేస్తుంది!" టేబుల్ మీద న్యూస్‌పేపర్ సర్దుతూ క్యాషియర్ పిల్చేసరికి ఆలోచనల్లో నుండి బయటకువచ్చింది మృదుల.

"ఎందుకు చెయ్యను ఈరోజు ఆకలి బాగా వేస్తోంది" అంటూ టేబుల్ దగ్గరకు నడచింది మృదుల. టేబుల్ ముందు కూర్చుంది అన్నమాటే గాని రెండు ముద్దలు కూడా మింగుడు పడలేదు. మధ్యలోనే లేచింది.

*"నా డ్యూటీ నేను చేశాను. అంతకు మించి నేనేం చెయ్యలేదు" అంటూ విసురుగా ఫోన్ పెట్టేసింది మృదుల తన కోపం అంతా ప్రకాష్‌కి అర్థమయ్యేలా.*

*ఉదయం బ్యాంక్‌కి వచ్చినప్పటినుండి అది పదిహేనో ఫోన్‌కాలో... ఇరవయ్యో ఫోన్‌కాలో! ప్రతిసారి తనను తాను డిఫెండ్ చేసుకోవాల్సి రావడంతో మృదులకి కోపం తారాస్థాయికి చేరుకుంది. ఇంతా చేసి తనేం చేసిందని...!*

ఆమె మనసును ఆలోచనలు మళ్ళీ చుట్టుముట్టాయి. బ్యాంకులో చేరినప్పటి నుండి ఇలాంటి సంఘటనలు చాలా జరిగినప్పటికీ ఈసారెందుకో ఆమె మామూలుగా వుండలేకపోయింది.

గ్రామీణ బ్యాంకులో ఉద్యోగం వచ్చినప్పటి నుండి యిలాంటి సంఘ టనలు ఎన్నో తన జీవితంలో జరిగాయి మొదటి మూడేళ్ళు పూర్తిగా హెడ్ ఆఫీస్‌కే పరిమితమయిపోయింది. బ్రాంచి మేనేజర్‌గా ట్రాన్స్ ఫర్ అడిగితే అందరూ వింతగా చూసినవాళ్ళే!
ఉసిరికాయలపల్లి వెళతాను అన్నప్పుడు అయితే అందరూ ముక్కున వేలేసుకున్నారు. ఉసిరి కాయలపల్లి బాగా ట్రబుల్ సమ్ బ్రాంచి. ఊరూ మంచిది కాదు. ఊరివాళ్ళూ మంచివాళ్ళుకారు. నిత్యాగ్నిహోత్రంలాగా మండిపోతూ వుంటుంది. ఉన్న రాజకీయ పక్షాలన్ని ఆధిపత్యాన్ని ప్రదర్శించు కోవడానికి బ్యాంకును ఒక వేదికగా మార్చుకుంటాయి. ఆ బ్రాంచిలో పనిచేసిన ఒక మేనేజర్‌ను దారుణంగా అవమానించారు. అతన్ని పూర్తిగా అన్‌డ్రెస్ చేసి వీధంతా తిప్పించారు. ఆ మేనేజర్ చేసిన పాపం అల్లా సర్పంచ్ రికమెండేషన్ చేసిన వాళ్ళకి లోను యివ్వకపోవడమే! అలాంటి బ్రాంచికి మేనేజర్‌గా వెళతాను అంటే ఛైర్మన్ సయితం అదిరిపడ్డాడు.

"అలాంటి ట్రబుల్ సమ్ బ్రాంచికి నువ్వెందు కమ్మా! ఆడపిల్లవి హెడ్ ఆఫీస్‌లో హాయిగా ఎకౌంట్స్, రీ ఫైనాన్స్ చూసుకోక" అన్నా డు ఆమె వంక సానుభూతిగా చూస్తూ!



'ఆడపిల్లవి' అన్న మాట వినగానే అప్పటిదాకా ఏ మూలో వున్న సంశయం కాస్తా తొలగిపోయింది.

"ఆడపిల్లని కాబట్టి వెళతాను అంటున్నాను సర్! నేను ఎంత సమ ర్థంగా పనిచేసినా, ఎంతసేపటికీ ఎకౌంట్స్, రీ ఫైనాన్స్ లేకపోతే పర్స నల్ డిపార్ట్‌మెంట్ అంతేగా సర్! అలాంటి ట్రబుల్‌సమ్ బ్రాంచి లో పనిచేసి, పురుషుడు విఫలమయిన చోటే స్త్రీ విజయం సాధిస్తుం దని చెప్పాలని వుంది సర్" అన్నది ఆవేశంగా మృదుల.

ఆమె మాటలకి ఛైర్మన్ మొహం ఎర్రగా కందిపోయింది.

"ఒకే! ఒకే! ఐ నో యిట్! ఐ నో యువర్ క్యాపబులిటి! యు కెన్ విన్ యిట్ హెండ్స్ డౌన్! నిన్ను ఉసిరికాయలపల్లి బ్రాంచి మేనేజర్‌గా పోస్టు చేస్తున్నాను" అంటూ వెళ్ళిపోయాడు.

ట్రాన్స్ ఫర్ ఆర్డర్ అందుకుని ఆమె ఎంతగానో సంతోషించింది. "నౌ ఐ యామ్ బ్రాంచి మేనేజర్" అనుకుంటూ మురిసిపోయింది. అందరూ ఆమెను సానుభూతిగా చూసినవాళ్ళే!

అయినా ఆమె అదేమీ పట్టించుకోలేదు. ఉసిరికాయలపల్లి మేనేజర్‌గా అటెండెన్స్ రిజిష్టర్‌లో సంతకం పెట్టింది మొదలు బ్రాంచి నుండి బయటకు వచ్చేంతవరకు ఆమె క్షణం క్షణం పోరాటమే చేసింది. తన ఉనికిని నిరూపించుకోవడం కోసం తను స్త్రీ అన్నమాట కాదు... కాదు... మనిషి అన్నమాట మర్చిపోయి గొడ్డులాగా కష్టపడింది.

పదిహేడు లక్షలు వున్న డిపాజిట్లను రెండు కోట్లకి పెంచింది. యాభై లక్షలు వున్న ఎడ్వాన్స్‌లను నాలుగు కోట్లకి పెంచింది. జీరో ఎన్.పి.ఎ.బ్రాంచిగా తీర్చిదిద్దింది. పీకల్లోతు నష్టాల్లో వున్న బ్రాంచిని ప్రాఫిట్ మేకింగ్ బ్రాంచిగా తీర్చిదిద్దింది.

అయినా ఒక్క మెచ్చుకోలు మాటకి ఆమె నోచుకోలేదు. పైగా ఆమె విజయం "జెండర్ పాలిటెక్స్"గా సాటి ఎంప్లాయిస్ అంతా కొట్టిపారేశారు. అందాన్ని ఎరగా వేసి డిపాజిట్లను సేకరించిందని అన్నారు. కొత్త రుణం మంజూరు చేసి పాత బకాయిలు కట్టించిందన్నారు. ఆవిడ పనిచేసిన మూడేళ్ళు వర్షాలు పడినయి. రైతులు అంతా సుఖ సంతోషాలతో వున్నారు గనుక వాక్‌యిన్ డిపాజిట్స్ వచ్చాయన్నారు.

ఒక్క ఛైర్మన్ మాత్రం "యూ హావ్ డన్ ఎ గుడ్ జాబ్" అంటూ ప్రోత్సహించి ఒక పెద్ద అర్బన్ బ్యాంక్‌కి మేనేజర్‌గా పోస్ట్ చేశాడు. అర్బన్ బ్రాంచి మేనేజర్‌గా ఆమె ఎంతోకాలం లేదు.

క్యాస్ట్ పాలిటెక్స్ ప్లే చేసి చౌదరి ఆమె సీటును ఆక్రమించుకున్నాడు. దాంతో ఆమె వేరే రూరల్ బ్రాంచికి షిఫ్టయిపోయింది.

ఆమె స్థానంలో వచ్చిన చౌదరికి చండశాసనుడు అని పేరు. మహా స్ట్రిక్ట్ మనిషి అని పేరు. మనిషికోసం రూలా! రూల్ కోసం మనిషా అంటే రూల్‌కోసమే మనిషి అనేరకం. ఇద్దరు ఆఫీసర్లని యింటికి పంపించాడాయన. ముగ్గురి ప్రొబేషన్ ఎక్స్ టెండ్ చేయించాడు. బ్యాంక్‌లో అతనికి ఎంతోపేరు. ఛైర్మన్ సైతం లేచి గౌరవిస్తాడు.

చౌదరి విషయం గుర్తుకొచ్చేసరికి మృదులకి "శ్యామ్ ప్రసాద్" విషయం ఏమయిందో తెలుసుకోవాలనిపించింది. వెంటనే ఆలోచనల్లో నుండి బయటకి వచ్చి చౌదరికి ఫోన్ చేసింది.

"సర్ నమస్తే నేను మృదులను"

"నమస్తే మేడం చెప్పండి"

"ఏం లేదు! మీ ఆఫీసర్ ప్రమోషన్ కన్ఫర్మ్ అయిందా! యిక్కడ మా శాస్త్రిగారి ప్రొబేషన్ పిరియడ్ ఎక్స్ టెండ్ అయింది" అంది మృదుల.

"శాస్త్రిగారి ప్రొబేషన్ ఎక్స్ టెండ్ అయిందా ఎన్నా ళ్ళు" చౌదరి ప్రశ్న.

"ఆర్నెల్లు"

"అంతేనా! మా శ్యాంప్రసాద్‌ది సంవత్స రం ఎక్స్ టెండ్ అయింది"
ఆ మాట వింటూనే ఫోన్ పెట్టేసి ఉస్సురుమంటూ నిట్టూర్చింది. ఆమె మనసులోకి హఠాత్తుగా ఒక పదం వచ్చి చేరింది.

'వివక్ష!' అవును 'వివక్షే!'

తనకూ చౌదరికి తేడా ఏంటి? అతను రూల్ ప్రకారం వుంటే చాలా స్ట్రిక్ట్ మనిషి ఎలా అయ్యాడు. తను ఎంప్లాయీస్‌ను హెరాస్ చేసే రాక్షసి ఎలా అయింది. అతని విజయం, విజయమే అయితే, ఆ విజయం కష్టపడి సాధించింది అయితే, తన విజయం వాక్-యిన్. విక్టర్ ఎలా అయింది. తన విజయంలోకి జెండర్ పాలిటిక్స్ ఎందుకు వచ్చి చేరాయి. పెర్‌ఫార్మెన్స్‌కి స్త్రీ పురుష తేడా ఏంటి?
ఆలోచనలతో ఆమె తల పగిలిపోతూ వుండగా

**బావుంది ఏం చేసినా పురుషుడే చెయ్యాలన్న మాట. పొరపాటున అలాంటి పనులు ఏవయినా స్త్రీ చేస్తే స్త్రీని కూడా పురుషుడుగా మార్చేస్తారన్నమాట.**

అటెండర్ 'టి' తీసు కుని వచ్చి టేబుల్ మీద పెట్టాడు. ఆమె టీ 'సిప్' చేస్తూ వుండగా

"మేడమ్! నేను బయల్దేరుతున్నాను" అంటూ క్యాషియర్ బయటకు వచ్చాడు. "వెళ్దరుగాని కాని ఏంటి విశేషాలు" అంది మృదుల. "ఏం వున్నాయి మేడం ఏమీ లేవు" అన్నాడు క్యాషియర్.

"మీకు తెలిసే వుంటాయి మీ నెట్‌వర్క్ పెద్దది కదా" నిన్న యూనియన్ వాళ్ళకి ఏం ఫోన్ చెయ్యలేదా" అంది మృదుల.

"చేశాం మేడం. అందరికి తెలిసిన విషయాలే! ప్రమోట్ ఆఫీసర్ ఏడుగురులో ఇద్దరి ప్రొబేషనరీ పిరియడ్ ఎక్స్ టెండ్ అయిందట" అన్నాడు క్యాషియర్. అతను యింకా ఏదో మాట్లాడబోతూ వుండగా ట్రింగ్... ట్రింగ్ మంటూ ఫోన్ మోగింది.

ఫోన్ అందుకుంటూ వెళ్ళమన్నట్లు క్యాషియర్‌కేసి సైగ చేసింది మృదుల. అటునుండి నవ్య.

"ఏంటే! యింకా బయల్దేరలేదా"

"ఇదిగో యిప్పుడే అన్ని సర్దుతున్నా నీ ఫోన్"

"సరేలే! త్వరగా బయల్దేరు. అన్నట్లు నీకీ విషయం తెలుసా!"

"ఏ విషయం"

"ఇవ్వాళ బ్యాంకులో నీకు ఒక కొత్తపేరు కాయిన్ చేశారు"

"ఏమిటది! రాక్షసా"

"కాదు"

"మరి"

"చౌదరమ్మట"

"వ్వాట్"

"అవును చౌదరమ్మట"

"బావుంది ఏం చేసినా పురుషుడే చెయ్యాలన్నమాట. పొరపాటున అలాంటి పనులు ఏవయినా స్త్రీ చేస్తే స్త్రీని కూడా పురుషుడుగా మార్చేస్తారన్నమాట. బావుంది" అంటూ పెద్దగా నవ్వింది మృదుల.

అటునుండి నవ్య శృతి కలిపింది.